
ప్రజాశక్తి

బుధవారం 6 ఆగస్టు 2025

5

పార్వతీపురం మన్యం



నేడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను, చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు తప్పనిసరిగా హాజరై విజవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

ఎరువులపై తెలుగు తమ్ముళ్ల పెత్తనం

- మారుమూల గ్రామాల్లో వారు చెప్పిందే వేదం
- ఆందోళనలో గిరిజన రైతులు
- కొరత లేదంటున్న వ్యవసాయ అధికారులు



సాలూరు మండలం కురుకూటిలో ఎరువు కోసం నిరీక్షిస్తున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎరువుల పంపిణీపై తెలుగు తమ్ముళ్ల దరువు పడుతోంది. ఫలితంగా ఎరువులు పక్కదారి పడుతున్నాయి. సామాన్య రైతులకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్ద రైతులు ఎక్కువ మొత్తంలో ఎరువులను కాజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్న బడా రైతులు అడ్డదారిలో ఎరువులను తన్నుకుపోతున్నారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కూడా నిస్సహాయ స్థితిలో వుండిపోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా యూరియా, డిఏపి ఎరువులను సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్నారు. సచివాలయాలలో పని చేస్తున్న వ్యవసాయ సహాయకులే ఎరువుల పంపిణీ బాధ్యతలు చేపడుతున్నారు. వ్యవసాయ శాఖలో కింద స్థాయి ఉద్యోగులతో ఎరువుల పంపిణీ చేపడుతుండడం, స్థానిక అధికారపార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోవడంతో పారదర్శకంగా పంపిణీ జరగడం లేదన్న విమర్శలున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు కూడా దీన్ని కాదనలేకపోతున్నారు. స్థానిక టిడిపి నాయకుల కనుసన్నల్లో ఎరువుల పంపిణీ జరుగుతున్న కారణంగా వారు సిఫార్సు చేసిన వారికే ఎరువులు అందుతున్న పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందడం లేదు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలను గిరిజనులు సాగు చేస్తున్నారు. అన్ని పంటలకు యూరియా, డిఏపి ఎరువుల అవసరం ఉంది. గిరిజన ప్రాంతంలో పెద్ద భూస్వాములు అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. వారికి ఎక్కువ మొత్తంలో ఎరువుల అవసరం ఉంది. అలాంటి పరిస్థితుల్లో చిన్న చిన్న రైతులకు పంపిణీ చేయాల్సిన ఎరువులను సచివాలయం సిబ్బంది పెద్ద రైతులకు అందజేస్తున్నారు. స్థానిక టిడిపి నాయకుల ఒత్తిడి మేరకు సిబ్బంది తలొగ్గుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సాలూరు మండలంలోని కురుకూటి పంచాయతీకి సోమవారం 250 యూరియా బస్తాల లోడ్ వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఏజెన్సీ ప్రాంత మారుమూల గిరిజన రైతులు పెద్దసంఖ్యలో ఎరువుల కోసం వచ్చారు. ఇక్కడ కూడా టిడిపి నాయకుల కనుసన్నల్లోనే ఎరువుల పంపిణీ జరిగింది. దీంతో గిరి శిఖర గ్రామాల రైతులకు అందని పరిస్థితి ఏర్పడింది. ఆధార్ నెంబర్ ఆధారంగా ఎరువుల పంపిణీ చేయడంతో గత కొద్ది నెలలుగా అవి పక్కదారి పడుతున్నాయి. వ్యాపారుల చేతుల్లోకి ఎరువులు వెళ్తుతున్నాయి. భూమి లేనివారికి కూడా ఎరువుల పంపిణీ మొదట్లో చేయడంతో నిజమైన రైతులకు అందని పరిస్థితి ఏర్పడింది. అలాగే పార్వతీపురం మండలంలోని సంగంవలస సచివాలయం పరిధిలో కూడా ఎరువుల కొరత ఉందని స్థానిక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ ప్రాంత రైతులు ఒడిశా లోని అలమండ వెళ్లి అధిక ధరలకు యూరియా, డిఎపి ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. పంట దిగుబడి కోసం ఎరువుల వినియోగానికి అలవాటు పడిన రైతులు ఎంత ధరకైనా కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు జిల్లాలో ఎరువుల కొరత లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యూరియా, డిఎపి ఎరువులకు బదులుగా నానో యూరియా, డిఎపి వాడాలని సూచనలిస్తున్నారు. ఒకవైపు కొరత లేదంటునే నానో ఎరువులను వాడాలని అధికారులు చెప్పడం వెనుక కొరతే కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడా ఎరువులు అందజేయాలని, రాజకీయ నాయకుల కనుసన్నల్లో కాకుండా అర్హులందరికీ అందజేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు ఆహార కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు ఈనెల 6న జిల్లాకు రానున్నారని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 6న పార్వతీపురం చేరుకుని రాత్రి బస చేస్తారని, 7న క్షేత్ర స్థాయిలో పర్యటన, అధికారులతో సమావేశం నిర్వహిస్తారని ఆమె చెప్పారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

వామపక్ష ప్రజా సంఘాలు డిమాండ్
విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం


రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా బిగిస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని, ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తొలుత స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఇఇకి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్తు రూపంలో మరో రూ.12,717 కోట్లు ఛార్జీల బాదుడుకు రంగం సిద్ధంగా కూటమి పాలన ఉందని అన్నారు. ఏడాదిలో రూ.30 వేల కోట్లు విద్యుత్ భారం అదానీ స్మార్ట్ మీటర్లతో ప్రజలను శాశ్వత దోపిడీకి పాల్పడుతుందన్నారు. విద్యుత్ భారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి దగా చేసిందని, సూపర్ సిక్స్ హామీలు నత్తనడగా సాగుతుండగా, భారాలు వేగంగా వేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం మోడీ ఆదేశాలకు తలొగ్గి కార్పొరేట్ యజమాని స్మార్ట్ మీటర్ల విధానాన్ని అమలుచేసిందని, ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను నిరసిస్తూ స్మార్ట్ మీటర్‌ను బిగిస్తే బద్దలు కొట్టండి మీకు నేను అండగా ఉంటానని స్వయంగా నారా లోకేష్ పిలుపునిచ్చారని, నేడు అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ విధానంలోనే నేటి కూటమి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే ప్రజలంతా వ్యతిరేకించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు పోల ఈశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.సంగం, రైతు కూలి సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, బి.భాషా, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, బి.లక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు జి.సర్వేసురావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పి.రాము, బలరాం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, ఏపి రైతు సంఘం నాయకులు ఇవి నాయుడు, ఐద్వా నాయకులు జి.తులసి, ఎం.గౌరి, బి.జయమ్మ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, ఎస్.ఉమా, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్, సిహెచ్.సింహాచలం, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, పిడిఎస్‌ఒ నాయకులు సోమేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు బి.రవికుమార్, ఎఐవైఎఫ్ నాయకులు బిటి నాయుడు, రైస్ మిల్ యూనియన్ నాయకులు జి.కృష్ణ, షాపు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చౌక్కాకు మౌళి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష ప్రజాసంఘాల నాయకులు

సాలూరురూరల్ : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టి ఆ శాఖ అధికారులకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెల జానకీరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసి ప్రజలపై భారాలు వేయద్దని కోరారు. ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో విపరీతమైన భారాలు వేస్తున్నారని, ఆ భారాలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, బి వి రమణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు ఇప్పుడు దొడ్డిదారిన పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లను ప్రజలకు బలవంతంగా అంటగట్టి వేలాది రూపాయలు భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, మీటర్లు పెట్టే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల ప్రజలలో విద్యుత్ ఛార్జీలపై, స్మార్ట్ మీటర్ల పై విస్తతంగా ప్రచారం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్న హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కె గౌరీశ్వరరావు,పువ్వుల తిరుపతిరావు, ఎం సన్యాసిరావు, ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

నాకు సంబంధం లేదంటూ
ఎంఇఒ ద్వారా బాధితులకు నోటీసు అందజేత

ప్రజాశక్తి -బలిజిపేట

మండలంలోని అరసాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో అక్రమంగా తొలగించిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యపై ప్రధాన పాత్ర పోషించిన డిఇఒ రాజ్‌కుమార్ మంగళవారం తనకు సంబంధం లేదంటూ సంబంధిత నిర్వాహకులకు ఎంఇఒ శ్రీనివాస్ ద్వారా ఉత్తర్వులు మంగళవారం అందజేశారు.

వివరాల్లోకి వెళ్లగా గత నెల 21న కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమను విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమను విధుల్లోకి వెళ్లనీయకుండా ఎంఇఒకు ఫోన్‌లో పలుమార్లు దుర్భాసలాడి బెదిరించి ఆటంకపరిచారని దీనికి ప్రస్తుత డిఇఒ రాజ్ కుమార్ కారణమని ఫిర్యాదు చేశారు. అనంతరం స్పందించిన కలెక్టర్ ప్రస్తుత డిఇఒకు షోకాజ్ నోటీసులు అందజేయగా, వెంటనే స్పందించిన డిఇఒ తనకు ఈ కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘనతో ఎటువంటి సంబంధం లేదని, దీనికి మండల కమిటీ, ఎస్ఎంసి చైర్మన్‌లేనని తెలుపుతూ ఉత్తర్వులను ఎంఇఒ ద్వారా మంగళవారం బాధితులకు మంగళవారం అందజేయించారు. ఇదిలా ఉండగా ఉన్నత న్యాయస్థానం నుంచి రాజభవన్ గవర్నర్ నుండి లీగల్ సెల్ నుంచి అనేక ఉత్తర్వులు వచ్చినప్పటికీ స్పందించకపోగా కంటెంట్ ఆఫ్ కోర్టులో ఈ విషయంపై చర్చ జరుగుతుండగా కోర్టు ధిక్కరణ కింద డిఇఒ లోలోపల మంతనాలు జరిపిస్తున్నారని బాధితులు ఆరోపించారు. కంటెంట్ ఆఫ్ కోర్ట్ కేసు నమోదైందని డిఇఒకు తెలిసినా కొట్టశ కళావతి, గొడవ పార్వతి అకౌంట్ నెంబర్లను మార్చి వారి స్థానంలో అక్రమంగా నియమింపబడిన నిర్వాహకుల అకౌంట్ నెంబర్లను నమోదు చేసి జీతాలు, బిల్లులను చెల్లించాలని ఎంఇఒపై గతంలో తీవ్రమైన ఒత్తిడి చేయించారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయం పత్రికల్లో ప్రచురణ కావడాన్ని గమనించిన డిఇఒ ఒక లేఖ రూపంలో తమకు సంబంధం లేదని తెలియజేయడం గమనార్హం. మరోవైపు మండల కమిటీ తీర్మానం లేకుండా కొట్టేసి కళావతి అకౌంట్ నెంబర్ను డిలీట్ చేసి ఆ స్థానంలో వేరే వారి అకౌంట్‌ను నమోదు చేయడం కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘనేనని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అన్నారు. అన్ని విధాలా బాధితులు ఇబ్బంది పడడానికి, కింద స్థాయి ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవడానికి కారణమైన డిఇఒపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గిరిజన సంస్కృతి ఉట్టిపడాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 9న జరుగు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉట్టిపడేలా నిర్వహిస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐటిడిఎ సెక్టోరల్, పోలీస్ అధికారులతో ప్రపంచ ఆదివాసి దినోత్సవ ముందస్తు ఏర్పాట్లపై సమావేశాన్ని ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శోభాయాత్ర లో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడాలన్నారు. ఆయా గిరిజన జాతులకు చెందిన నృత్యాలు ప్రదర్శించాలన్నారు. అడవితల్లి విగ్రహానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన ప్రజలు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సంబరాలకు విచ్చేసిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. తాగునీరు సదుపాయం కల్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎటువంటి ఆటంకాలు జరగకుండా పోలీసు వారు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల నాలుగు మండలాల గిరిజన ప్రజలతో ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన 16 మండలాల గిరిజన ప్రజలతో పాతపట్నంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఈ దినోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో జి.చిన్నబాబు, డిడి అన్నదొర, ఇఇ కుమార్, ఎఇ సునీల్, సిఐ చంద్రమౌళి, ఎస్సై అమ్మనరావు, పిహెచ్‌ఒ గణేష్, డిప్యూటీ డిఇ రామ్మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయపార్వతి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్‌లపై చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అక్రమ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్‌లపై నిరంతరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇటువంటివి నిరంతరం కొనసాగాలని ఉద్బోధించారు. ఆర్ఎంపీ/ పీఎంపీ క్లినిక్లపై ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ ఆఫీసర్లు, స్టేషన్ హౌస్ అధికారులు, ఎమ్మార్వో లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా, నిబంధనలు పాటించకుండా నడిపే క్లినిక్‌లను వెంటనే సీజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆర్ఎంపీ/ పీఎంపీలు ఫస్ట్‌ఎయిడ్ చికిత్స వరకే పరిమితమై ఉండాలని, ఇంజెక్షన్లు వాడకూడదని వివరించారు. ఫార్మసీలు విధిగా రిజిస్టర్లను నిర్వహించాలని, అటాచ్డ్ క్లినిక్స్ ఉన్న ఫార్మసీలను మూసివేయాలని, డ్రగ్స్‌ను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యుని సూచన లేకుండా యాంటీ బయోటిక్స్/ యాంటీ మలేరియల్స్ ఇవ్వడం, రికార్డులు లేకపోవడం నేరంగా పరిగణించబడుతుం దన్నారు. అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అంకిత సురానా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు,జిల్లా కుష్ఠు, ఎయిడ్స్,టిబి నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డ్రగ్ ఇన్ స్పెక్టర్ ఆశా షేక్, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్ఎంపి వైద్యులు

ప్రజాశక్తి -పార్వతీపురం

కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను ఆర్ఎంపి వైద్యులు మంగళవారం కలిశారు. టిడిపి అరుకు బిసి సెల్ అధ్యక్షులు రుద్ర కోటేశ్వరరావు ఆధ్వర్యాన ఆర్ఎంపి వైద్యులు కలెక్టర్‌ను కలిసి సమస్యల్ని వివరించారు. ఇటీవల జిల్లాలో ఆర్ఎంపి వైద్యుల వైద్యం వికటించి ఇద్దరు రోగులు మృతి చెందిన విషయంపై కలెక్టర్ శ్యాం ప్రసాద్ విచారణకు ఆదేశించారు. ఆర్ఎంపి వైద్యులు వారి స్థాయికి మించి వైద్యం చేయడాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకుని చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆయనతో మాట్లాడారు. ఎమ్మెల్యే సూచన మేరకు టిడిపి నాయకుడు కోటేశ్వరరావు ఆర్ఎంపీ వైద్యులను తీసుకుని వచ్చి జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఇకపై తమ పరిమితికి లోబడి వైద్యం చేస్తామని, ప్రాథమిక వైద్యం మాత్రమే అందిస్తామని ఆర్ఎంపీ వైద్యులు కలెక్టర్‌కు చెప్పారు.

నేడు విద్యుత్ అంతరాయం

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో బుధవారం నాడు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంట వరకు 11కెవి బెలగాం ఫీడర్‌పైన ఉన్న పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయము కలుగునని ఆశాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టటడం వల్ల సౌందర్య థియేటర్ బ్యాక్ సైడ్, చర్చి వీధి, వైకెఎం కాలనీ, మెయిన్ రోడ్ పైన కొన్ని షాపులకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అంతరాయనికి ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదివాసీ హక్కులు అమలు చేయాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

ప్రజాశక్తి - పాలకొండ

ఆదివాసీ హక్కులను అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలం లోని మల్లంగూడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా మంగళవారం ఆరిక భానుచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్సవ వేడుకలు జరుపుతూ ఆదివాసీ హక్కుల్ని అమలు చేయకుండా వారిని మోసగిస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీల రిజర్వేషన్లపై దాడి చేస్తున్నాయన్నారు. 2006లో అమలులోకి వచ్చిన అటవీ హక్కు చట్టాన్ని నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదన్నారు. ప్రస్తుతం అనేక గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల్లేకుండా అత్యవసర పరిస్థితుల్లో డోలి మోత కొనసాగుతున్నాయన్నారు. మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఆదివాసీ ఉద్యోగుల కల్పనకు డిమాండ్ చేస్తున్నటువంటి ప్రత్యేక డిఎస్సీ జరపకుండా గిరిజన నిరుద్యోగులను మోసగిస్తున్నారన్నారు. జీవో 3 స్థానంలో 100శాతం ఉద్యోగుల కల్పనకు ప్రత్యేక చట్టం తెస్తానని చెప్పి మాట్లాడిన ముఖ్యమంత్రి యూటర్న్ తీసుకొని ఆదివాసీ యువతను దగా చేస్తున్నారని విమర్శించారు. 1/7చట్టం, పీసా చట్టం కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ ఆదివాసీ దినం తూతూ మంత్రంగా కాకుండా ఒక నిర్దిష్టమైన హామీలతో నిర్వహించి నిజమైన ఆదివాసీ దినంగా జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతాహక్కుల సాధనకై ఐక్యంగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, మండల కార్యదర్శి కె.రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో వృథా నీటికి అడ్డుకట్ట

అధికారులు పట్టించుకోకపోవడంతో ముందుకొచ్చిన రైతులు



తలుపుల వద్ద ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదంకలాం ఆనకట్టు నుంచి విడుదలయ్యే సాగునీరు వృథా కాకుండా రైతులు శ్రమదానంతో షట్టర్ల వద్ద ఇసుక బస్తాలు వేసుకుంటూ కాపాడుకుంటున్నారు. రైతుల శ్రమదానంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, రైతులు గోపి నాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ముందే పెదంకలాం కాలువలో పూడిక తీసి మరమ్మతులు చేసి సాగునీరందించాల్సి ఉండగా, అలా చేయలేదన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే నీరు విడుదల చేసి రెండు వారాలవుతున్నా ఇప్పటికీ చెరువులు నిండలేదని, భూములకు నీరు లేదని తెలిపారు. కానీ నాయకులు, అధికారులు చివరి ఆయకట్టు వరకు నీరిస్తామని చెప్పడం రైతులను దగా చేయడమేనని విమర్శించారు. నారాయణపురం, వెంగాపురం, బలిజిపేట, పలగర గ్రామాలకు చెందిన రైతులు ట్రాక్టర్ ద్వారా ఇసుక బస్తాలు షట్టర్ దగ్గర వేయడానికి తీవ్ర అవస్థలుపడుతున్నారని అన్నారు. షట్టర్లు సక్రమంగా మరమ్మతులు చేయకపోవడంతో కిందకి నీరు వృథాగా పోతుందన్నారు. షెట్టర్లు పైకి లేవడంలేదని, పెద్ద అంకలం కాలువ దగ్గరికి జెఇ వచ్చి సమస్య పరిష్కారం చేస్తామని రైతులకు హామీ ఇచ్చినా అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడికతీత తీయించి, పాడైపోయిన షట్టర్ల వద్ద ఇసుక బస్తాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో కూర్మినాయుడు, వెంకటనాయుడు, రమణ, శ్రీను, సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, జనసేన నాయకులు పైల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిలకు జీతాలు చెల్లించాలి


ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్టీలకు వెంటనే జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని ఐటిడిఎల్లో సిఆర్టీల జీతాలు చెల్లించారని, ఇక్కడ జూన్, జూలై నెల జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. జీతాల చెల్లింపు విషయంలో ఐటిడిఎ అధికారులు గందరగోళంలో ఉన్నారని చెప్పారు. జిపిఎస్‌లకు సిఆర్టీలను డెప్యుటేషన్ పై నియమించాలని కోరారు.

స్కానింగ్ డాక్టర్‌ను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో స్కానింగ్ డాక్టర్‌ను వెంటనే నియమించాలని కాంగ్రెస్ జిల్లా ఒబిసి చైర్మన్ వి.దాలినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రం ఆసుపత్రిలో పని చేస్తున్న రేడియాలజీ డాక్టర్ జయరాంను సాలూరు ఏరియా ఆసుపత్రి కి బదిలీ చేయడంతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారని చెప్పారు. దీనివల్ల జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. ప్రయివేటు సెంటర్లో ఒకసారి స్కానింగ్ చేసుకుంటే వెయ్యి నుంచి రూ.1500 వరకు ఖర్చయ్యే పరిస్థితి వుందన్నారు. కావున వెంటనే రేడియాలజీ డాక్టర్ ని నియమించాలని డిమాండ్ చేశారు.


నీరులేక ఎండిపోతున్న వరినారు

సాగు నీరు రాక... నాట్లు వేయక

ప్రజాశక్తి - వీరఘట్టం

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరురాక కావడంతో వరి నాట్లు వేయలేదు. మండలంలోని నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి, యు వెంకంపేట, రేగులపాడు, తూడి, తదితర గ్రామాలకు నేటికీ కూడా కాలువల ద్వారా సాగునీరందక పోవడంతో పచ్చగా కనిపించాల్సిన పంట పొలాలు సాగునీరు లేక బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. గతనెల 16న తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసి 18 రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ పొలాలకు నీరు చేరుకోకపోవడంతో అన్నదాతలు సాగునీటి కోసం ఆరాటం పడుతున్నారు. ప్రస్తుతం నీరు లేక పంట పొలాలు ఎండుతున్నాయి. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి సక్రమంగా సాగునీరందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

సవర ఆర్ట్స్ అభివృద్ధికి కృషి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సవర ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. సవర ఆర్ట్స్‌పై సీతంపేట మీఎంఅర్ట్‌లో నిర్వహించిన ఒక రోజు వర్క్ షాప్‌లో పిఒ పాల్గొన్నారు. సవర ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తామని, గిరిజన చిత్రకారులకు మరింత ప్రోత్సాహిస్తామని అన్నారు. ఆర్ట్‌కో వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లి పాలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పుట్టిన ప్రతి పసిబిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించినప్పుడే పసిపిల్లలకు తల్లిపాలతోనే ఆరోగ్యం సాధ్యమని సిడిపిఒ జి.సుగుణ కుమారి అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంతర్రాష్ట్ర రహదారిపై తల్లిపాలు వారోత్సవాల భాగంగా మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణీలకు తల్లిపాలు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్యూల్, సూపర్వైజర్ శారదంబ, వైద్య ఆశా అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రతా నియమాలను వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని నీలకంఠపురం ఎస్సై నీలకంఠరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురంలో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించి, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ద్రువీకరణ పత్రాలు కలిగివుండి ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ ధరించి, మద్యం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక రైతు ఉత్పత్తి కేంద్రం ద్వారా మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు కరణం చిన్నమ్మ నాయుడు ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌డిఎ డిపిఎం ఎల్ హెచ్ పోతు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని రైతు ఉత్పత్తి సంఘం కార్యక్రమం అమలు గూర్చి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపిఎం కె.రాము, సిసి పై.ఆనంద్, ఐఎఫ్‌సి యాంకర్ పర్సన్ సోనియా, ఎఫ్‌పిఒ సిసి ఉదయ్ కుమార్, సిసిలు, ఎంఎస్‌లు, రైతు మిత్రులు కె.ధర్మారావు, వెంకటరావు, ఎఫ్‌పిఒ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలను సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఐటిడిఎ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో పాల్గొని తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బిడ్డకు తల్లిపాలు ప్రాముఖ్యత గూర్చి ఆశాలకు తెలియజేసి, ఈనెల 12న జరిగబోయే డి వార్మింగ్ డే, వర్షాకాలంలో నేపథ్యంలో ప్రబలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ఆశా యాప్, సర్వేస్ అప్డేట్ పర్యవేక్షణ గురించి వివరించి ప్రతి ఆశా వర్కర్ గ్రామాల్లో జ్వరాలు సర్వే సక్రమంగా చేయాలని సూచించారు. అనంతరం పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ బి.ప్రజ్ఞ, హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎటిడబ్ల్యుఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎటి డబ్ల్యుఒ రతని సూచించారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు పెడుతున్న మెనూ పరిశీలించారు. విద్యార్థుల విద్యాబోధన, పాఠ్యాంశాలపై పట్టు సాధించారా అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల మౌలిక వసతులు పై ఆరా తీశారు.

విద్యార్థుల ర్యాలీ

సీతంపేట : పట్టణంలో తిరంగా ర్యాలీని విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 2 నుండి ఆగస్టు 15 వరకు అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతంపేటలో విద్యార్థులు, పంచాయితీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చినబాబు, జిటిడబ్ల్యు స్కూల్ హెచ్‌ఎం చంద్రరావు, ఎంఇఒ ఆనందరావు, పంచాయితీ కార్యదర్శి బి.రామకృష్ణ, సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట సిఐ బి.హరి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని అన్నారు. అలాగే ఈనెల 11 నుండి 17 వరకు రోడ్లపై ఓవర్ స్పీడింగ్, 18 నుంచి 24 వరకు హెల్మెట్లు లేకుండా డ్రైవింగ్ చేసే వారిపైన వారోత్సవాలు చేపడుతున్నామని అన్నారు. హెల్మెట్లు లేకుండా డ్రైవింగ్ చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. ఈనెల 25 నుంచి 31 వరకు ద్విచక్ర వాహనదారులపై బ్లాక్ స్పాట్స్ ఎన్ఫోర్స్మెంట్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ఈ మేరకు ద్విచక్ర వాహనదారులు, డ్రైవర్లు తగిన మేరకు రోడ్లపై తమ వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగు ..నేల తల్లికి బాగు

ప్రజాశక్తి - కురుపాం

నవధాన్యాలు సాగుతో నేలతల్లికి బహు బాగుగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ రాజారావు అన్నారు. మండలంలో దురుబిలి, సూర్య నగర్ గిరిజన గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, మారుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో జోడించినపుడే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా, సిహెచ్‌డబ్ల్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హక్కులు కల్పించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాలూరులో ఆశా వర్కర్ల సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎన్‌వై నాయుడు, నాయకులు రామలక్ష్మి ,రాధ, భాగ్యలక్ష్మి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో 60ఏళ్లు వచ్చిందన్న కారణంతో అనేకమంది ఆశా వర్కర్లను తొలగిస్తున్నారని, వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా ప్రభుత్వాలు ఇలాంటి నిర్ణయాలు చేయడం ఆశా వర్కర్లను చిన్నచూపు చూడడమే అవుతుందని అన్నారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 ఏళ్లకు సర్వీసు పెంచాలని, రిటైర్ అయినపుడు బెనిఫిట్ అమలు చేయాలని,సంక్షేమ పథకాలన్నీ వర్కర్లకు ఇవ్వాలని, అదనపు పనులు, నిలిపివేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఆర్సీ వెంటనే వేసి 12వ పిఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 18న పార్వతీపురంలో జరిగే ఆశా వర్కర్ల మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ఆశా వర్కర్లుంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా నాయకులు సుబ్బలక్ష్మి, మాధురి, అనిత, అప్పలకొండ, హైమా, సింహాచలం, శైలజ తదితరులు పాల్గొన్నారు.


కొమరాడలో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా, సిహెచ్‌డబ్ల్యులు

కొమరాడ : ఆగస్టు 18న ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సంబంధించి మొదటి జిల్లా మహాసభ జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మాదలంగి, కొమరాడ, కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో నాయకులు హేమా, రాజేశ్వరి, పార్వతి, దుర్గ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య రంగ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సమస్యల పట్ల మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్పందించడం లేదని విమర్శించారు. ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలపై దశల వారీ ఉద్యమాన్ని నిర్వహించేందుకు యూనియన్ కృషి చేస్తుందని, అందులో భాగంగానే ఈనెల 18న పార్వతీపురం పట్టణంలో జరుగు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల జిల్లా మొదటి మహాసభలలో ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి పరిధిలో 5 సబ్ సెంటర్లు, కొమరాడ పరిధిలో 9 సబ్ సెంటర్లు, మాదిలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరు సబ్ సెంటర్ పరిధిలోని నూతన నాయకత్వాన్ని ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ సెంటర్ లీడర్లు ఆశ వర్కర్లు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం :మండలంలోని తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమావేశాలలో సిఐటియు నాయకులు పాల్గొని ప్రసంగించారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో నిర్వహించిన పిహెచ్సి మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ, మండల కన్వీనర్ కే గౌరీశ్వరరావు మాట్లాడుతూ ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్కర్ల సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్యమాన్ని నిర్వహించేందుకు యూనియన్ కృషి చేస్తుందని, అందులో భాగంగానే ఈనెల 18న పార్వతీపురం పట్టణంలో జరుగు ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల జిల్లా మొదటి మహాసభలలో ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సాలూరులో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

నూతన కార్యవర్గ ఎన్నిక

తాడికొండ పిహెసి, మరియు 8 సబ్ సెంట్ల పరిధిలో గల నూతన నాయకత్వాన్ని ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కె నిర్మల, ఎస్.కృష్ణవేణి, కోశాధికారిగా పి.భారతితో పాటు 14మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పాచిపెంట : మండలంలోని గురునాయుడుపేట, పాచిపెంట పిహెచ్‌సిల వద్ద ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని యూనియన్ నాయకులు పి.నిర్మల, మంజుల, బడ్నాన లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న పార్వతీపురంలో జరుగు ఆశా వర్కర్ల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మక్కువ : స్కీం వర్కర్లుగా ఉన్న ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మక్కువ, శంబర పిహెచ్‌సిలో పరిధిలో గల ఆశా, సిహెచ్ డబ్ల్యూ సమావేశాల సిఐటియు మండల నాయకులు కృష్ణారావు, దాలమ్మ ఆధ్వర్యాన జరిగింది. కార్యక్రమంలో నాయకులు సరస్వతి, విజయగౌరి, జానకి, ఉమామహేశ్వరి, అనిత, పార్వతి, నిర్మల పెద్ద ఎత్తున ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుఒలు పాల్గొన్నారు.

సెల్ టవర్లు చాలా ముఖ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సెల్ టవర్లు చాలా ముఖ్యమని, ఇందుకు సంబంధించిన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పిఎంజిఎస్‌వై -4 కింద జిల్లాలో చేపడుతున్న సెల్ టవర్ల ప్రాముఖ్యత ఎంతైనా ఉందని, ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జియో, బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటుపై ఎంపిడిఇఒలు, సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రగతిలో ఉన్న జియో, బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రాంతాలకు టవరుకు సంబంధించిన మెటీరియల్ తీసుకువెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉన్నందున, ఉపాధి హామీ పనుల్లో మంజూరు చేస్తామని చెప్పారు. అతి ముఖ్యమైన రహదారి పనులను గుర్తించి, నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ డ్వామా పీడీని ఆదేశించారు. అలాగే అటవీ ప్రాంతంలో అనుమతుల కోసం ఈ వారంలో ప్రతిపాదనలు పంపాలని డిఎఫ్ఒను ఆదేశించారు. సమావేశంలో జెసి ఎస్.ఎస్. శోబిక, ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీల కె.రామచంద్రరావు, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, సాలూరు, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం ఎంపిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.

నేలను కాపాడుకోవాలి : డిపిఎం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వరప్రసాధితమైన నేలను మనమంతా కాపాడుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. తోటపల్లి నూతన జట్టు సంస్థ ప్రాంగణంలో జిల్లాలోని 15 మండలాల్లో పని చేస్తున్న విఎఎలు, విహెచ్ఎలు, ఎఇఒలకు మూడు రోజులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిదాలు, మనిషి అశ్రద్ధ వల్ల నేల కలుషితమవుతుందన్నారు. నేల పైభాగం సన్నటి మట్టిపొరలతో పాటు అనేక పోషక పదార్థాలు కలిగి ఉంటాయని, అటువంటి పోషక పదార్థాలున్న హ్యూమస్ పొరలు, పంటల్లో చీడపీడల నివారణకు అతిగా ఉపయోగించే రసానికి ఎరువులు, పురుగులు మందుల వల్ల కలుషితమవుతున్నాయని అన్నారు. కావున సహజ సిద్ధంగా లభించే వనరులను ఉపయోగించుకుని నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండించుకోవాలన్నారు. మొక్కల పెరుగుదలకు ద్రవ,ఘన జీవామృతం క్రమం తప్పకుండా వేసుకోవడం, తెగుళ్లు, పురుగులు నివారణకు కషాయాల గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎలు, ఎంటిలు, ట్రైనర్లు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా చిత్తశుద్ధితో పనిచేశారు

డాక్టర్ డివిజిని అభినందనందించిన జగన్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా చిత్తశుద్ధితో పనిచేయడమే కాకుండా కమిషన్ పరిధిలో ఎస్టీ సామాజిక వర్గానికి చక్కటి సేవలందించారని డాక్టర్ డివిజి శంకరరావును మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అభినందించారు. కమిషన్ చైర్మన్‌గా పనిచేసే అవకాశం కల్పించినందుకు డాక్టర్ శంకరరావు మంగళవారం జగన్మోహన్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. మూడేళ్ల పదవీకాలంలో కమిషన్ చైర్మన్‌గా రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటించి కమిషన్ తరపున ఎస్టీ సామాజిక వర్గానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రత్యక్షంగా తెలుసుకున్న సమస్యల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక సిఫార్సులను కూడా కమిషన్ తరపున చేయడం జరిగిందని జగన్మోహన్ రెడ్డికి తెలిపారు. అందరి సహాయ సహకారాలతో కమిషన్ చైర్మన్ సంతృప్తికరంగా విధులు నిర్వహించగలిగానని శంకరరావు తెలిపారు.


డివిజిని అభినందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

నెల్లిపర్తి భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

దశాబ్దాల కాలంగా నెల్లిపర్తి దళితులు సాగు చేస్తున్న భూములను సర్వేలు చేసి పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు సాగు చేస్తున్న భూముల వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి ప్రభుత్వ భూములను నెల్లిపర్తికి చెందిన కొంతమంది దళితులు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, ఈ భూములకు అనేక సందర్భాల్లో అధికారులకు పట్టాలు ఇవ్వమని అర్జీలు పెట్టుకున్నా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములకు ఎటువంటి సంబంధం లేని పాచిపెంట మండలం విశ్వనాధపురం గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులకు అడ్డగోలుగా పట్టాలిచ్చారని, ఇచ్చిన పట్టాలను వెంటనే రద్దు చేసి సాగులో ఉన్న దళితులకు, పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న వారికి పూర్తిస్థాయిలో సర్వేలు జరిపి అందరికీ పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. లేకుంటే పోరాటానికి సిద్ధపడతామని తెలిపారు. కార్యక్రమంలో లింగాల చంటి, బొంగ ప్రసాద్, రేగిడి పాలయ్య, బొంగ కష్ణ, గంగయ్య, బొంగ మురళి, డర్రు గోపి తదితరులు పాల్గొన్నారు

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వ్యాధులు ప్రబలకుండా క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంఎంకె తిరుమలప్రసాద్ అన్నారు. మంగళవారం ఆశాడే కార్యక్ర మమును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సీజన్‌లో ప్రబలే వ్యాధులపై వైద్యాధికారి డాక్టర్ తిరుమలప్రసాద్ వైద్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉండేలా మరింత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎప్పటికప్పుడు గర్భిణీలు, శిశువు లలో అనారోగ్య లక్షణాలను వెంటనే గుర్తించాలని ఫలితంగా ప్రమాద కర స్థితికి చేరకుండా జాగ్రత్తపడవచ్చున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా తల్లిపాలు ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జగదీశ్వరి, రమణమ్మ, చింతాడ ఉదయకుమారి, ఫకీరునాయుడు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పి.ఉషారాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల ఆశాడే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణీలకు నెలవారీగా టీకాలు వేసేలా చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బందికి అవగాహన కలిగించాలన్నారు అలాగే పెదంకలాం పిహెచ్‌సిలో ఆశాడే నిర్వహించారు. సమావేశంలో ఇఒ జి సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మి, హెచ్ఎస్ గోపాల్ రావు, సిహెచ్ఒ వెంకటరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం

ప్రస్తుత వర్షాకాలంలో విజృంభించే మలేరియా, డెంగీ, చికెన్ గునియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.మణి కోరారు. తాడికొండ పిహెచ్‌సిలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా కేసులు రెండు రకాలుగా నమోదు వస్తాయని, వాటిని గుర్తించి రోగికి చికిత్స అందించాలని అన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు దోమతెరలు వాడాలన్నారు. తల్లిపాలు వారోత్సవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సమావేశంలో వైద్యులు బుద్దేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమందేలా చూడాలన్నారు. ప్రసవ సమయంలో 108 వాహనానికి సమాచారం ఇచ్చి గర్భిణీని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. ఈ విషయంపై గర్భిణీతో పాటు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన కార్యక్రమానికి వైద్య తనిఖీల కోసం ఆసుపత్రికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంత కుమారి, శుభారతమని, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బిటివాడ పిహెచ్‌సిలో వైద్యాధికారులు ఎ.మానస, ఎస్.నితీశ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ

పార్వతీపురంటౌన్ : జిల్లా స్థాయి కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమానికి జిల్లాకు చెందిన గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులు, ఎన్సీడి వైద్య బృందానికి విజయనగరం జిల్లా ఆసుపత్రిలో మంగళవారం కేన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ నిర్వహించారు. మెడికల్ ఆంకాలజీ విభాగానికి (పిఒయు) చెందిన వైద్యులు, సంబంధిత విభాగాల వైద్యులు పవర్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్సీడి 3.0 సర్వే, కేన్సర్ స్క్రీనింగ్, రిఫరల్ విధానంపై వివరించారు. క్షేత్ర స్థాయిలో కేన్సర్, ఇతర దీర్ఘకాలిక రోగ లక్షణాలను వైద్య సిబ్బంది గుర్తించి సర్వే, స్క్రీనింగ్ మరింత పటిష్టం చేసి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ ప్రమాణాలను అధిగమించేందుకు వైద్యారోగ్యశాఖ త్వరలో ప్రవేశపెట్టనున్న ఎన్సీడి4.0 సర్వేకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. గత నెలలో జిల్లా ఎన్సీడి వైద్య బృందాలకు రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా నుంచి ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ కె.కౌశిక్, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులు, ఎఫ్ఎల్.సి రమణి, డిఇఒ తాజ్ తదితరులు హాజరయ్యారు.

కొత్తవలస, బగ్గందొరవలసలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలస, బగ్గందొరవలసలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఎస్. అవినాష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ వరి గట్లపై కంది విత్తనాలు వేయడం వల్ల మంచి ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే వరిలో ఎరువుల యాజమాన్యం వరి పంట దిగుబడిని ప్రభావితం చేస్తుందని, సరైన మోతాదులో ఎరువులు వేయడం వల్ల పంట ఆరోగ్యంగా పెరుగుతుందని, మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

పాచిపెంట : ప్రకృతి సేద్యాన్ని పాటించే రైతులు రసాయన మందుల జోలికి పోకుండా కషాయాలను ఉపయోగించి పురుగులు తెగుళ్లను అరికట్టుకోవాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పోడు భూముల్లో మొక్కజొన్న పంట పండించి పురుగు మందుల పిచికారీ చేసినట్లయితే తేనెటీగలు నశించి జీవ వైవిధ్యం దెబ్బతింటుందని కావున తెగుళ్లను కషాయాల ద్వారా మాత్రమే అరికట్టుకోవాలని సూచించారు. మండలంలోని తంగలాం, వేటగానివలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఐసిఆర్‌పి అప్పన్న ఆధ్వర్యంలో దశ పత్ర కషాయాన్ని తయారు చేయించారు. ఈ కషాయాన్ని ఎకరాకు ఐదు లీటర్లు చొప్పున పిచికారీ చేసుకుంటే తెగుళ్ల నివారణ జరగడమే కాకుండా పంట ఆరోగ్యంగా పెరుగుతుంది అని తెలిపారు. అలాగే గొట్టూరు, వేటగానివలస, మూటకూడు తదితర పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో గిరిజనులు వర్షాధార మొక్కజొన్న సాగుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో సిఆర్పి సురేష్ ఐసిఆర్‌పిలు రాజు, సంజీవి, రైతులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని పనసభద్ర, దుగ్గేరులో పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాలు మండల వ్యవసాయాధికారి సిహెచ్ భారతి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వరిలో పాటించాల్సిన యాజమాన్యం గురించి ఎఒ వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ వెన్నెల, విఎఎ రవణమ్మ, రైతులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : ప్రతి రైతు తాము పండించే పంటలకు తప్పనిసరిగా ఇ- పంటను నమోదు చేసుకొని ప్రభుత్వం అందించే అన్ని రకాల సబ్సిడీలను, ఎరువులను, అన్నదాత సుఖీభవ పథకాలను పొందాలని మండల వ్యవసాయ అధికారిని కె.శిరీష తెలిపారు. మండలంలోని కొత్తవలస, కరాసవలసలో విజయనగరం కృషి విజ్ఞాన కేంద్రం, సబ్జెక్టు మేటర్ స్పెషలిస్ట్ బృందంతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త అమృత వీణ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని, అధిక దిగుబడి సాధించడానికి విత్తన ఎంపిక నుంచి కోత దశ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా రైతులకు తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారి అను మాట్లాడుతూ ప కోళ్ల పెంపకం, ఆవుల, గొర్రెలలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలను గురించి వివరించారు. పశువులకు సరైన పోషకాహారం, పరిశుభ్రత ఎంత ముఖ్యమో రైతులకు వివరించారు. ఎఒ మాట్లాడుతూ రైతులు నిర్దేశించిన మోతాదులో మాత్రమే యూరియాను వాడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కరాసువలస సర్పంచ్ ఒంటి లక్ష్మి, వైస్ సర్పంచ్ యుగంధర్, ఎంపిటిసి రమాదేవి, వ్యవసాయ విస్తరణ అధికారి, విఎఎ, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలైనట్లు రైల్వే జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ రత్నాకర్ తెలిపారు. మంగళవారం ఆయన వేకువ జామున కొమరాడ మండలం కూనేరు - గుమడ రైల్వే స్టేషన్ మధ్యలో రామభద్రపురం సమీపాన అప్ లైన్, డౌన్ లైన్ మధ్యలో తుమ్మపల్లి, నారాయణపూర్, హీరాఖండ్ రైలు నుంచి జారిపడ్డంతో తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుందని తెలిపారు. క్షతగాత్రుడ్ని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు చెప్పారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు విజయనగరం మెడికవర్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. గాయలైన వ్యక్తి స్వగ్రామం అయినాడ జంక్షన్ అని, విజయనగరం నుంచి రాయగడ గుడికి కుటుంబంతో కలిసి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ మేరకు రైల్వే హెచ్‌సి రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ వలలో పట్టణ వ్యాపారి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సైబర్ మోసానికి పట్టణానికి చెందిన ఒక వ్యాపారి ఇటీవల గురై సుమారు రూ.12 లక్షలు పోగొట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వ్యాపారి మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేస్తే తక్కువ పెట్టుబడి పెడితే రెట్టింపు ఇస్తామని ఒక కంపెనీ నుంచి మేసేజ్ రావడంతో సదరు వ్యాపారి డబ్బుమీద ఆశతో ఆన్లైన్ ట్రేడింగ్ గేమ్‌లో పెట్టుబడి పెట్టడంతో ముందు తక్కువ డబ్బులు పెట్టుబడి పెట్టగా రెట్టింపు డబ్బులు వచ్చాయి. ఆ తర్వాత లక్షల్లో పెట్టుబడులు పెట్టగానే, డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయేనని గ్రహించి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఘటనపై పట్టణ ఎస్ఐ గోవిందరావును వివరణ అడగ్గా సైబర్ నేరాల ఉచ్చులో ఎవరూ పడొద్దని, మొబైల్ ఫోన్లో వచ్చిన లింకులను ఓపెన్ చేస్తే ఇలాంటి పరిణామాలే జరుగుతాయని అన్నారు.

దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక రూరల్ స్టేషన్ సర్కిల్ పరిధిలో 10 దోపిడీ కేసులకు సంబంధించిన నిందితుడ్ని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ గోవిందరావు విలేకరులతో మాట్లాడారు. జియ్యమ్మవలస మండలం పిట్టలభద్రకు చెందిన తామడ సంతోష్ రూరల్ పరిధిలో గల పార్వతీపురం రూరల్, కొమరాడ, సీతానగరం, బలిజిపేట, స్టేషన్ల పరిధిలో ఒంటరి మహిళలు, రాత్రి వేళల్లో బయట పడుకున్న వారిని లక్ష్యంగా చేసుకొని పది దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. బైక్ లిఫ్ట్ అడిగి యజమానిని మద్యం తాగించి బైక్‌తో పరారయ్యాడని, నిందితుడ్ని బలిజిపేటలో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుడి నుంచి 10 తులాలు బంగారంతో పాటు రూ.13 వేలు నగదు, ఒక బైక్ స్వాధీనం తీసుకున్నట్టు తెలిపారు. నిందితుడు గతంలో నేర చరిత్ర కలిగిన ఉన్నట్లు నిర్ధారించినట్టు తెలిపారు. సమావేశంలో సిసిఎస్ సిఐ అప్పారావు, రూరల్ ఎస్ఐ బి.సంతోషి కుమారి, కొమరాడ, సీతానగరం, బలిజిపేట ఎస్ఐలు పాల్గొన్నారు.